## క్లుప్తంగా

### నేడు మండలస్థాయి సమావేశం

కట్టంగూర్ : ముసాయిదా ఫొటో ఓటరు జాబితాపై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండలస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా మండలంలోని 22 గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన పార్టీల అధ్యక్ష కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### ఓటర్ల జాబితాపై ఎంపీడీఓకు ఫిర్యాదు

చండూరు : మండల పరిధిలోని పుల్లెంల గ్రామపంచాయతీ కార్యాలయంలో సెప్టెంబర్ 13న విడుదల చేసిన గ్రామ పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాను సవరించాలని కోరుతూ బుధవారం ఆ గ్రామ యువకులు ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని 10 వార్డుల్లో సమానంగా ఓటర్లను పొందుపరచాలని కోరారు. కార్యక్రమంలో పిన్నింటి నరేందర్‌రెడ్డి, ఉయ్యాల సత్యనారాయణ, పేసర్ల హరీష్, ముక్కాముల రాజు, పెసర్ల గౌతమ్ పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

మునుగోడు: పీఆర్‌టీయూ మునుగోడు మండల నూతన కమిటీని మంగళవారం రాత్రి మునుగోడులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పులిపలుపుల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సయ్యద్ యూసుఫ్‌పాష, ప్రధాన కార్యదర్శిగా మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అన్నెపురెడ్డిని ఎన్నుకున్నారు. అదేవిధంగా అసోసియేట్ అధ్యక్షుడుగా డి.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గాలి శ్రీనివాస్, వై.సునిత, కార్యదర్శులుగా గొడ్డేటి నర్సింహ, రాధలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

### సీఐటీయూలో చేరిక

నల్లగొండ రూరల్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహిళా సమాఖ్య భవనం వద్ద 34 మంది వీఓఏలు బుధవారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ సమక్షంలో సీఐటీయులో చేరారు. ఈ సందర్భంగా దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ అర్హత కలిగిన వీఓఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ సమాఖ్యలకు గ్రామాల్లో భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాసర్ల సువర్ణ, జిల్లపెల్లి మంగ, జె కవిత, పున్నం సంతోష, ఎల్లబోయిన పార్వతమ్మ, గోపగోని రాణి, కాసాని శైలజ, ఓర్సు పద్మ, అలివేలు, పి సంధ్య, కుందనపల్లి కవిత, కళ్యాణి సంధ్య, బోగరి పుష్ప, కోటేశ్వరి, బాకీ శైలజ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల నిరసన

నకిరేకల్ : గురుకుల పాఠశాలల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నకిరేకల్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల ఎదుట బుధవారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులందరికీ జీరో వన్ జీరో పద్ధతిలో జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాల నిర్ణయ పట్టిక సవరించాలన్నారు.

### సంతకాల సేకరణ

నల్లగొండ టౌన్: భవన నిర్మాణం వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దని, ప్రభుత్వమే సంక్షేమ పథకాలను అందించాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలే సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గాదె యాదయ్య డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సంతకాల సేకరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. నారబోయిన సత్యనారాయణ, యాదగిరి, గాదె రవి, గీసుకొండ వెంకన్న, ఎల్లయ్య, మేడి శాంతికుమార్, బుర్ర యాదయ్య, నర్సింహ, బుచ్చయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

**కలెక్టర్‌కు వినతి**

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలను అందజేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చిన్నపాక లక్ష్మీనారాయణ, అద్దంకి నరసింహ, సైదాచారి, బి.వెంకటయ్య, గురవయ్య, మన్నె శంకర్, రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండటౌన్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఈ నెల 25న జరిగే మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి మురారి మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తవిటి నాగార్జున, మెరుగు చంద్రకళ, చంద్రవంక దుర్గ, పడారి లింగయ్య, బంటు శివ, మల్లెబోయిన నాగరాజు, జి.శేఖర్, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# డయాలసిస్ సెంటర్ ప్రారంభమయ్యేనా !

- జులై నెలలో మర్రిగూడకు సెంటర్ మంజూరు
- ఇప్పటివరకు ఆస్పత్రిని సందర్శించని వైద్యాధికారులు
- ఇబ్బందులు పడుతున్న పేషెంట్లు


మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రి

మర్రిగూడ : శరీరంలో నీటిని ఎప్పటికప్పుడు వడగట్టి మిగతా అవయవాలను సంరక్షించడంలో కిడ్నీలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. అలాంటి కిడ్నీలు దెబ్బతింటే డయాలసిస్ చేయించుకోవడం నరక యాతనగా మారుతుంది. మర్రిగూడతోపాటు చుట్టుపక్కల మండలాల్లో డయాలసిస్ కేంద్రాలు లేకపోవడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నల్లగొండ, హైదరాబాద్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదని కిడ్నీ రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆస్పత్రికి చేరని పరికరాలు**

మర్రిగూడ మండలంతోపాటు సమీప మండలాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మర్రిగూడ మండల కేంద్రంలోని ఆస్పత్రికి డయాలసిస్ సెంటర్‌ను గత జులై నెలలో మంజూరు చేయించారు. అయితే ఇప్పటివరకు సెంటర్ ప్రారంభం కాలేదు. సంబంధిత జిల్లా వైద్యులు సెంటర్ ఏర్పాటుకు కనీసం పరిశీలన కూడా చేయలేదు. బెడ్లు, సంబంధిత పరికరాలను ఇప్పటివరకు తీసుకురాలేదు.

**మర్రిగూడలో 15 మందికి పైగా..**

మర్రిగూడ మండల కేంద్రంలోని ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభమైతే దూర ప్రాంతాలకు వెళ్లే దుస్థితి తప్పుతుంది. మర్రిగూడతోపాటు సమీప మండలాలైనా నాంపల్లి, చింతపల్లి, మాల్, గట్టుప్పల్, చండూర్, గుర్రంపోడులోని పలు గ్రామాల పేషెంట్లు కూడా ఈ సేవలను వినియోగించుకోనున్నారు. మర్రిగూడ మండలంలో పదిహేను మందికి పైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు సమాచారం.

**నెలకు సుమారు రూ.15 వేలు ఖర్చు**

డయాలసిస్ పేషెంట్‌కు నెలకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఖర్చు అవుతుంది. బాధితులు రోజు విడిచి రోజు.. లేదా వారానికి ఒకటి రెండుమార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. డయాలసిస్‌కు వెళ్లినప్పుడల్లా సుమారు రూ.1000 నుంచి రూ.రెండు వేల వరకు ఖర్చు అవుతుంది. డయాలసిస్ చేయని పక్షంలో ఆరోగ్యం మరింత క్షీణించే అవకాశం ఉంటుంది. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి స్పందించి మర్రిగూడలో డయాలసిస్ సెంటర్‌ను త్వరగా ప్రారంభించాలని పేషెంట్లు కోరుతున్నారు.

**రూ.15వేలు ఖర్చు అవుతోంది**

ఐదు సంవత్సరాల నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నా. హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి ఆస్పత్రిలో నాకు డయాలసిస్ చేస్తున్నారు. రోజు విడిచి రోజు బస్సుకు వెళ్లి వస్తుంటాను. ప్రయాణానికి ఆరుగంటల సమయం పడుతోంది. మందులు, ఇతర ఖర్చులు నెలకు సుమారు రూ.15వేలు ఖర్చు అవుతుంది. అధికారులు స్పందించి మర్రిగూడలో సెంటర్‌ను త్వరగా ప్రారంభించాలి.

–మహేష్, శివన్నగూడ, డయాలసిస్ పేషెంట్

**ఐదు బెడ్లతో ప్రారంభిస్తాం**

మర్రిగూడకు డయాలసిస్ సెంటర్ మంజూరు అయింది. త్వరలోనే ఐదు బెడ్లతో సెంటర్‌ను ప్రారంభించనున్నాం. సంబంధిత పరికరాలు, బెడ్లు రానున్నాయి. డయాలసిస్‌కు సంబంధించిన వైద్య సిబ్బంది, అన్నిరకాల మెటీరియల్ రావాల్సి ఉంది. మర్రిగూడ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభమైతే పరిసర ప్రాంతాల పేషెంట్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– శంకర్‌నాయక్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్


ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరిస్తున్న విద్యార్థులు

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: గ్రామాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని గురుజాల గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి చరిత్రలో నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని, ప్రజల కోసం, అభివృద్ధి సంక్షేమం కోసం పాటుపడే పార్టీ అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే ముందుగా ఇందిరాగాంధీ, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు అన్నెబోయిన సుధాకర్, గూని వెంకటయ్య, చంద్రశేఖర్, అంజయ్య, కోక సాయి, ముత్తయ్య, ఎర్ర సుధాకర్, మల్లయ్య, చింత ధనుంజయ్య, నరేశ్, సతీష్, యాదయ్య, ఉపేందర్, దేవిరెడ్డి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

**మా బడిని తెరిపించండి సారూ..!**

సీసీ రోడ్డు ప్రారంభోత్సవం అనంతరం వెళ్లిపోతున్న ఎమ్మెల్యే సామేల్ వద్దకు మండలంలోని వల్లాల మోడల్ స్కూల్‌కు విద్యార్థులు వచ్చారు. తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలను గత సంవత్సరం మూసివేశారని, దీంతో తాము మండలంలోని వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు వెళ్లి చదువుకుంటున్నామని తెలిపారు. మూతబడిన పాఠశాలను తెరిపించాలని వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జిల్లా విద్యాధికారికి ఫోన్ చేసి మూతబడిన పాఠశాలను తెరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

# ‘యానాల’ పోరాట పటిమ మరువలేనిది


నకిరేకల్ : సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : తెలంగాణ ఉద్యమ సమయంలో యానాల లింగారెడ్డి పోరాట పటిమ మరువలేనిదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన యానాల లింగారెడ్డి సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. లింగారెడ్డి విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. పార్టీలో కూడా ఎలాంటి పదవులు ఆశించకుండా నిస్వార్థంగా పనిచేస్తూ అందరి హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు. లింగారెడ్డి మరణం తీరని లోటన్నారు. ఈ సంతాప సభలో తెలంగాణ ఉద్యమ నేత డాక్టర్ చెరుకు సుధాకర్, పూజర్ల శంభయ్య, గాయకుడు నర్సిరెడ్డి, దైద రవీందర్, గాజుల శ్రీనివాస్, బొమ్మకంటి కొమరయ్య, లింగాల వెంకన్న, కట్ట వెంకట్‌రెడ్డి, బొజ్జ సుందర్, గాదగోని కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు వినతి**

చిట్యాల: పట్టణంలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తుండడంతో సర్వీస్ రోడ్డులోని దుకాణాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ స్థానిక వ్యాపారులు బుధవారం నకిరేకల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ బెల్లి సత్తయ్య, కృష్ణ, దుకాణదారులు మేడిశెట్టి ఉమాశంకర్, విజయ్‌కుమార్, జగిని వెంకన్న, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వెంకట్, కరుణాకర్ పాల్గొన్నారు.

### బెల్టు దుకాణాలు మూసివేయాలని ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునుగోడు: బెల్టు దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గూడపూర్ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలగోని సత్యంగౌడ్, నన్నూరి విష్ణువర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, మిర్యాల వెంకన్న, సాగర్ల లింగస్వామి, నక్క వెంకన్న, ఉప్పరి యాదగిరి, మల్లయ్య, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

కేతేపల్లి: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. బుధవారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వందశాతం అమలు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఊదరగొడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో 30 శాతం కూడా అమలు కాలేదన్నారు. ఇప్పటివరకు వానాకాలం రైతుబంధు ఊసెత్తకపోవడం సిగ్గు చేటన్నారు. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ విషయాన్ని పక్కదారి పట్టించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టేవిధంగా ప్రతిపక్ష నాయకులపై దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నకిరేకల్ ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కేతేపల్లి మాజీ జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు కె.సైదిరెడ్డి, జి.సత్యనారాయణగౌడ్, గుర్రం గణేశ్, నవీన్‌రావు, టంగుటూరి సైదులు, జటంగి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు


గట్టుప్పల్‌లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కనగల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాలు ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని సీడీపీఓ నిర్మల అన్నారు. బుధవారం కనగల్ మండల పరిధిలోని కురంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజుల అంగన్‌వాడీ టీచర్లు సుజాత, తల్లులు పాల్గొన్నారు. అదేవిధంగా పర్వతగిరిలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని నేరడ, చిన్నకాపర్తి, వట్టిమర్తి గ్రామాల్లో ఐసీడీయస్ ఆధ్వర్యంలో బుధవారం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునిత, రోజా, అంగన్‌వాడీ టీచర్లు లింగమ్మ, విజయలక్ష్మీ, హేమలత, ఇందిరా, అరుణ, అలివేలుమంగ, సుజాత, జ్యోతి, నాగమణి పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకటమ్మ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆకుకూరలు తీసుకోవాలని తల్లులకు, బాలింతలకు సూచించారు. హెచ్ఎం అమృత, సూపర్‌వైజర్ యాదమ్మ, కార్యదర్శి షఫి, అంగన్‌వాడీ టీచర్లు రమ, జయలక్ష్మి, అంజిబాయి ఉన్నారు. అదేవిధంగా చండూరు మండలంలోని బోడంగిపర్తి గ్రామంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# తులం బంగారం స్కీం అమలు చేయాలి

- బీజేపీ నేత విజయరామారావు


కేతేపల్లి : గుడివాడలో బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న విజయరామారావు

నకిరేకల్ : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మహిళలకు తులం బంగారం పథకాన్ని వెంటనే అమలు చేయాలని బీజేపీ నేత, మాజీ మంత్రి విజయరామారావు డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో బుధవారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో నకిరేకల్ నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధించేలా పటిష్టం కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నకిరేకంటి మొగిలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, గర్రె మురళి, యానాల శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, చెనగాని రాములు, బ్రహ్మదేవర రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం**

నార్కట్‌పల్లి : ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల్లో భాగంగా పథకాలు అమలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు విజయ రామారావు అన్నారు. బుధవారం నార్కట్‌పల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పజ్జూరి వెంకట్‌రెడ్డి, మునుకుంట్ల గణేశ్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, అక్కెనపల్లి సత్తయ్య, రామలింగయ్య, సత్యనారాయణ, శేఖర్, గణేశ్, రామలింగం, తిరుమలేష్, శివ తదితరులు ఉన్నారు.

**బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి**

కేతేపల్లి: గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి విజయరామారావు అన్నారు. బుధవారం గుడివాడ గ్రామంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాస శ్రీనివాస్, అంజన్‌కుమార్, మధుకర్‌రెడ్డి, కృష్ణ, రాచకొండ శ్రీనివాస్, పగిళ్ల దామోదర్, సందీప్ పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి

నల్లగొండ టౌన్: పత్తి, వరి పంటలకు వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండ శ్రీశైలం బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పత్తి క్వింటాలుకు రూ.12500, వరి ధాన్యం క్వింటాలుకు రూ.2850 ఇవ్వాలని, అదనంగా రూ.1000 బోనస్ ప్రకటించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వి.వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. నాగిరెడ్డి, రైతు సంఘం నాయకులు అయితరాజు నరసింహ, సాగర్ల మల్లేష్, చాపల మారయ్య, కుంభం కృష్ణారెడ్డి, వి.నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

**అక్రమ మైనింగ్ నిలిపివేయాలని..**

మర్రిగూడ : శివన్నగూడ రిజర్వాయర్ పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో పోతుగొండ నరసింహస్వామి గుట్టల నుంచి అక్రమంగా నిర్వహిస్తున్న మైనింగ్‌ను నిలిపివేయాలని ఆ గ్రామానికి చెందిన పగిళ్ల లింగస్వామి బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనుమతి లేకుండా బ్లాస్టింగ్ చేస్తుండడంతో అడవి జంతువులు గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నాయని, తక్షణమే మైనింగ్ నిలిపివేయాలని కోరినట్లు తెలిపారు.

# ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి


వినతిపత్రం అందిస్తున్న యూనియన్ ప్రతినిధులు

నల్లగొండ టౌన్: అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఆర్జాతండాలోని మూడో తరగతి వరకు పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీడీపీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను ప్లే స్కూల్స్‌గా మారుస్తామని, ప్రతీ సెంటర్‌కు ఒక టీచర్‌ను నియమిస్తామని జూలై 19న సీఎం ప్రకటించారని గుర్తుచేశారు. ఈ నిర్ణయం వల్ల అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. కార్యక్రమంలో పి.సరిత, కె. సముద్రమ్మ, పాదూరి లక్ష్మి, రాజేశ్వరి, అరుణ, జ్యోతి, సైదాచారి పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించండి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ సైదానాయక్

చిట్యాల: విద్యార్థుల్లో భాషా సామర్థ్యాలతోపాటు గణిత చతుర్విధ ప్రక్రియలను పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని చిట్యాల మండల నోడల్ ఆఫీసర్ పి.సైదానాయక్ పేర్కొన్నారు. చిట్యాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన తీరు, అభ్యసన ప్రక్రియలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రాథమిక తరగతుల్లో విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం ద్వారా బోధన చేయాలని సూచించారు. హెచ్ఎం అంబటి సత్తయ్య, ఉపాధ్యాయులు బాదం భిక్షపతి, సరిత, సుధాకర్‌రెడ్డి, శారద, పుష్పలత పాల్గొన్నారు.

### బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

కనగల్: మండల పరిధిలోని కురంపల్లి ఉన్నత పాఠశాల నుంచి బదిలీ, పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సన్మానం పొందిన వారిలో కోణం శ్రీనివాస్, ప్రవీన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేఖర్, ఖైరునిసా బేగం పూర్వ విద్యార్థులు నీలం స్వామి, సోము అఖిల్, శంకరాచారి, దోటి సాయి, జ్యోతి ఉన్నారు.

### బాల్య వివాహాలను అరికట్టాలి

కట్టంగూర్ : బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషిచేయాలని అశ్రితా సంస్థ హైదరాబాదు కోఆర్డినేటర్ శోభారాణి అన్నారు. బుధవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులకు అశ్రితా సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మాదక ద్రవ్యాల నిర్మూలన, బాలికలపై లైంగిక వేధింపులు అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం అంబటి అంజయ్య, సంస్థ సీఎస్‌బ్ల్యూ చిన రాయుడు, ఝాన్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బీజేపీ సభ్యత్వ నమోదు

చండూరు : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చండూరు మున్సిపల్ కేంద్రంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ బుధవారం జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నరసింహతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, బోడ ఆంజనేయులు, భూతరాజు శ్రీహరి, మహిళా మోర్చా అధ్యక్షురాలు తడకమల్ల అశ్విని, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కటకం ధనలక్ష్మి, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు ప్రియాంక, బాలజ్యోతి ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా ఎయిడ్స్ వ్యాధికి గురైనవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం గోగికార్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సొంత డబ్బులతో రోడ్డుకు మరమ్మతులు


గూనలు ఏర్పాటు చేయిస్తున్న మురళి

మునుగోడు: తమ గ్రామానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు అనేకమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో ఆ గ్రామానికి చెందిన నకరకంటి మురళి అనే యువకుడు తన సొంత డబ్బులతో రోడ్డుకు మరమ్మతులు చేయించాడు. సోలిపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో అడ్డుగా ఉన్న వాగులో వర్షాకాలం వచ్చిందంటే చాలు నీరు నిలిచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఆ వాగుపై వంతెన నిర్మాణంతో పాటు పక్కా బీటీ రోడ్డు ఏర్పాటుచేయాలని ఆ గ్రామ ప్రజలు అనేకమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నారు. గత ఉప ఎన్నిక సందర్భంగా వంతెన నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయిస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ఆ పనులకు 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు శంకుస్థాపన చేశారు. కానీ నేటికీ టెండర్ పిలువలేదు. ఈ ఏడాది వర్షాలు కురవడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. విసుగెత్తిన ఆ గ్రామ యువకుడు దాదాపు రూ.60వేలకు పైగా ఖర్చు చేసి ఆ వాగులో గూనలు వేయించి తాత్కాలిక మరమ్మతులు చేయించాడు.

### గుత్తా అమిత్‌రెడ్డికి సన్మానం

నల్లగొండ టూటౌన్ : పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుత్తా అమిత్‌రెడ్డిని బుధవారం డ్వాబ్ సంస్థ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డ్వాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు, మాజీ సర్పంచ్ నాగలవంచ వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

### సుమతమ్మకు నివాళి

కేతేపల్లి: సీపీఎం సీనియర్ నాయకుడు, కేతేపల్లి మాజీ సర్పంచ్ ఏళ్ల అశోక్‌రెడ్డి తల్లి సుమతమ్మ(80) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. సుమతమ్మ మృతదేహాన్ని బుధవారం పలువురు నేతలు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, నకిరేకల్ ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, జటంగి లక్ష్మమ్మ వెంకటనర్సయ్యయాదవ్, మాజీ ఎంపీపీ బడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### కాన్వాయ్ అడ్డుకునేందుకు యత్నించిన ఇద్దరి బైండోవర్

తిప్పర్తి : మిర్యాలగూడ పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో తిప్పర్తి మండల కేంద్రం మీదుగా వస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాన్వాయ్‌ని మండల కేంద్రానికి చెందిన రొట్టెల జానయ్య, కస్పరాజు రమేష్ అడ్డుకునేందుకు యత్నించారు. డి–40 కాలువ నీరు విడుదల చేయడం లేదని నిరసన తెలియజేయడానికి ప్రయత్నించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఏఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

### గణేశ్ లడ్డూ వేలం రూ.36,016

మునుగోడు: మండలంలోని చొల్లేడు గ్రామంలో శ్రీ విగ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక విగ్రహం లడ్డూ వేలం పాట రూ.36016 పలికింది. ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం లడ్డూ వేలం వేయగా ఆ గ్రామానికి చెందిన జనిగల ముత్యాలు లడ్డూ దక్కించుకున్నాడు.